క్లుప్తంగా...

ప్రత్యేక పూజలు

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమాలోని కాళీమాత అమ్మవారిని ఏబీసీసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.రవి శేఖర్ రెడ్డి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్నారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు నాగరాజు, కుటుంబరావు, భరత్‌కుమార్, గురునాథ రావు, శ్రీరాం, నాళం రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. తలాబ్‌చంచలం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ డాక్టర్ సమీనాబేగంతో కలిసి బుధవారం పర్యటించారు. భవానీనగర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



గోల్కొండ: గోల్కొండ డివిజన్‌లో బుధవారం సాయంత్రం వాన దంచికొట్టింది. సుమారు 45 నిమిషాల పాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. టోలిచౌకీ చౌరస్తా, టూమ్స్ రోడ్డు, రేతిబౌలి రింగ్ రోడ్డు, అహ్మద్ నగర్ తదితర ప్రాంతాల్లోని రోడ్లపై 2 అడుగుల మేర వరద నిలిచింది.

దాడి కేసులో 6 నెలల జైలు



వెంకటేశ్

జియాగూడ: జీహెచ్‌ఎంసీకి చెందిన ఇద్దరు కార్మికులను ఇనుప రాడ్‌తో దాడిచేసిన ఓ నిందితుడికి బుధవారం నాంపల్లి క్రిమినల్ కోర్టు 6 నెలల జైలు శిక్ష విధించినట్లు గోషామహల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. బేగంబజార్ చేతన్ ప్లాస్టిక్ ప్రాంతంలో ఉంటున్న జి.వెంకటేశ్ (56) వృత్తిరీత్యా రిక్షా కార్మికుడు. కాగా ఏప్రిల్‌లో ముస్లింజంగ్‌పూల్ వద్ద గల భూలక్ష్మీ ఆలయ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీకి చెందిన ఇద్దరు కార్మికులతో గొడవపడి ఇనుప రాడ్‌తో దాడి చేసి గాయపరిచాడు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా బుధవారం నాంపల్లి కోర్టు జడ్జి జి.ప్రభాకర్ ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రేమలత వాదించగా, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ కె.లక్ష్మయ్య, కానిస్టేబుల్ అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



శ్రీనివాసరావు

చార్మినార్: చార్మినార్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 2025–27 సంవత్సరానికి గాను మద్యం షాపుల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చార్మినార్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి. శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21 ఏళ్ల వయస్సు గల వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు రూ.3 లక్షలు (నాన్ రీఫండబుల్) చెల్లించి ఈనెల18 లోగా హైదరాబాద్ జిల్లాకు సంబంధించిన దరఖాస్తులు నాంపల్లిలోని అబ్కారీ భవన్ నాలుగో అంతస్తులో అందించాలని సూచించారు.

12న 'దసరా మిలాప్'

ముషీరాబాద్: తెలంగాణ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన దసరా మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మిలాప్ కన్వీనర్ ఆర్.వివేకానంద్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్ఆర్‌టీ కమ్యూనిటీహాల్‌లో దసరా మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని దళిత సంఘాలు, దళిత నాయకులు, మహిళా ప్రతినిధులు, దళిత యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా కన్వీనర్ గజ్జెల సత్యనారాయణ, శ్యామ్‌సుందర్(చిట్టి), అరుణ, గండి కృష్ణ, గడ్డం నవీన్, వెంకటేష్, బాస్కర్, రామస్వామి, గిరి, పరమల్‌కుమార్, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.



మూసాబౌలి చౌరస్తాలో ఇష్టారాజ్యంగా వెళ్తున్న వాహనదారులు

ట్రాఫికర్..!

మూసాబౌలి చౌరస్తాలో నిత్యం వాహనాల రద్దీ

- నగరానికి..పాతబస్తీకి ప్రధాన లింక్ రోడ్డు
- కానరాని ట్రాఫిక్ సిగ్నల్స్
- పట్టించుకోని అధికారులు

చార్మినార్: మూసాబౌలి చౌరస్తాలో ట్రా'ఫికర్' నెలకొన్నది. నగరం నుంచి పాతబస్తీకి.. పాతబస్తీ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ ప్రధాన రోడ్డే అనుసంధానంగా ఉంటుంది. ఖిల్వత్, లాడ్‌బజార్, బండికాఅడ్డా, చెలాపురా, కసరట్టా తదితర ప్రాంతాలతో పాటు పురానాపూల్, దూద్‌బౌలి, ఖబూతర్‌ఖానా తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు మూసాబౌలి చౌరస్తా మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. దీంతో నిత్యం వాహనాలతో కిటకిటలాడుతోంది. అయితే ఇంతటి రద్దీ గల ప్రాంతంలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం.. మరోవైపు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన ట్రాఫిక్ పోలీసులు సైతం విధి నిర్వహణలో లేకపోవడంతో ఎవరీ ఇష్టం వచ్చినట్లు వారు వెళ్తుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఏ వాహనం ఎటు వైపు నుంచి ఎటు వైపు దూసుకెళ్తుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

సిగ్నల్స్ లేక గంటల తరబడి ట్రాఫిక్ జాం..

మూసాబౌలి చౌరస్తాలో ఏళ్ల తరబడి ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. అత్యవసర పరిస్థితుల్లో నిర్దేశిత సమయానికి చేరుకోవాల్సిన వాహనదారులు ఇక్కడి ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుంటున్నారు. మూసాబౌలి చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు సాధ్యమైన త్వరగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుతో పాటు ట్రాఫిక్ పోలీసులు విధి నిర్వహణలో ఉండేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోంది..

మూసాబౌలి చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్నది. పట్టించుకోవాల్సిన ఉన్నతాధికారులు తమ కార్యాలయాలకే పరిమితం కావడంతో సమస్య మరింత జటిలమవుతోంది. ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ ఉన్నతాధికారులు పదే పదే చెబుతున్నప్పటికీ.. ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. ఇప్పటికైనా సత్వరమే స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

–మహ్మద్ షఫీక్, శాలిబండ

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో వాహనదారుల దూకుడుకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. ఏ వాహనం ఎటు వెళ్తుందో.. తెలియని పరిస్థితులు నెలకొంటున్నాయి. సిగ్నల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ పోలీసులను విధి నిర్వహణలో ఉంటే వాహనాదారుల్లో కొంతైన మార్పు వస్తుంది. ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి తగు చర్యలు చేపట్టాలి

–రాజేందర్, ఘాన్సీబజార్

పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం



షేక్‌పేట్‌లో పర్యటిస్తున్న రాష్ట్ర మంత్రి జి.వివేక్

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని రాష్ట్ర మంత్రి జి.వివేక్ అన్నారు. షేక్‌పేట్ డివిజన్‌లోని వినోభానగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి అంతంత మాత్రంగానే జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే షేక్‌పేట్ డివిజన్‌లో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. బస్తీలు, కాలనీల సంఘాల వారితో పాటు స్థానికులకు ఏమైనా సమస్యలు ఉంటే కార్యాలయానికి వచ్చి నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సిద్ధ సదానంద్, షేక్‌పేట్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆశోక్, రఘు, బాలు తదితరులు ఉన్నారు.

'న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలి'



సమావేశంలో అధ్యక్షుడు సుబ్బయ్య, కార్యవర్గ సభ్యులు

యాకుత్‌పురా: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ న్యాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. సుబ్బయ్య, కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. పురానీ హవేలిలోని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులోని న్యాయశాఖ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సుబ్బయ్య అధ్యక్షతన బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ.. ఈ ఘటన న్యాయ వ్యవస్థ, న్యాయమూర్తుల గౌరవానికి విరుద్ధమైనదన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో తెలంగాణ న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు నరేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆర్. ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు అనిత, కోశాధికారి మనీష్, కార్యనిర్వాహక కార్యదర్శి రాకేష్, కార్యవర్గ సభ్యులు సంధ్య, సుధా, స్వప్న, జయలక్ష్మి, స్నిగ్ధ, ఉమేర సుల్తానా, సూర్య ప్రకాశ్ పాల్గొన్నారు.

పార్కు పరిసరాలు అధ్వానం..!

గోల్కొండ: అహ్మద్‌నగర్ డివిజన్‌లోని బడాబజార్‌ను అనుకుని ఉన్న జీహెచ్‌ఎంసీ పార్కు అధ్వానంగా తయారైంది. పార్కు ఫెన్సింగ్ చుట్టూ నెలల తరబడి భవన నిర్మాణ సామగ్రి అడ్డదిడ్డంగా పడి ఉంది. మరోవైపు ప్రధాన గేటు వద్దే వ్యర్థాల డంపింగ్ చేస్తున్నారు. దీంతో పార్కులోకి అడుగు పెట్టాలంటే స్థానికులు జంకుతున్నారు. అయినా ప్రజాప్రతినిధులు, బల్దియా ఉద్యానవన శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పార్కులో పిల్లల ఆట పరికరాలు సైతం పూర్తిగా పనికి రాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



అహ్మద్‌నగర్ పార్కు ఫెన్సింగ్ పక్కనే భవన నిర్మాణ సామగ్రి



పార్కు గేటు పక్కనే వ్యర్థాల డంపింగ్

సేవా భావంతో పని చేయాలి

గోల్కొండ: డయాలసిస్ సెంటర్ల నిర్వాహకులు సేవా భావంతో పని చేయాలని మజ్లిస్ శాసన సభా పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. టోలిచౌకీ సాలర్‌జంగ్ కాలనీలోని సాఫ్ కిడ్నీ సెంటర్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సాఫ్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ మహ్మద్ నియాజ్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి డయాలసిస్ చేసుకుంటున్న రోగులతో మాట్లాడారు. అనంతరం సెంటర్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. సెంటర్ వారు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సాఫ్ కిడ్నీ సెంటర్ నెఫ్రాలజీ, ట్రాన్స్‌ప్లాంట్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ షోయబ్ అహ్మద్‌ఖాన్, సాఫ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ ఆకీబ్ అహ్మద్‌ఖాన్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం

చార్మినార్: కాంగ్రెస్ పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని హైదరాబాద్ జిల్లా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, చార్మినార్ నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ ఇన్‌చార్జి వెంకటేశ్ అన్నారు. హైకోర్టు వద్ద బుధవారం వారు మాట్లాడుతూ.. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో పని చేస్తున్నారని పేర్కొన్నారు. గురువారం హైకోర్టులో బీసీలకు సానుకూలమైన తీర్పు వస్తుందని ఆశిస్తున్నామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

వాహనదారుడిపై పెట్రోల్ బంక్ సిబ్బంది దాడి

గోల్కొండ: పెట్రోల్ పోయించుకునేందుకు వచ్చిన ఓ వాహనదారుడిపై పెట్రోల్ బంక్ సిబ్బంది దాడి చేశారు. గోల్కొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2న ఖలీం అనే వ్యక్తి గోల్కొండ ఖటోరా హౌస్‌లోని భారత్ పెట్రోల్ బంక్‌కు వెళ్లాడు. అతడి చేతిలో సిగరేటు ఉండడంతో ఇక్కడ తాగవద్దని సిబ్బంది హెచ్చరించారు. ఈ విషయంపై వాగ్వాదం జరగడంతో సిబ్బంది రెచ్చిపోయి ఖలీంపై ముక్కుమ్మడిగా దాడి చేసి చితకబాదారు. ఈ విషయమై బాధితుడి భార్య గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా పెట్రోల్ బంక్ వద్ద గల సీసీ ఫుటేజీలు, సాక్షులను విచారించిన అనంతరం దాడి చేసిన షకీల్ ఆలీఖాన్, మోయిజ్, సోహెల్, షర్ఫీల్, యాజ్ తదితరులతో పాటు నిబంధనలకు విరుద్ధంగా పెట్రోల్ బంక్‌లో సిగరేటు తాగిన ఖలీంపై కూడా కేసు నమోదు చేసినట్లు గోల్కొండ పోలీసులు తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు, ఏసీపీ ధనలక్ష్మి

అబిడ్స్: వాహనారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నగర ట్రాఫిక్ డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సౌత్‌వెస్ట్ జోన్ ఏసీపీ ధనలక్ష్మితో కలిసి కుల్సుంపురా, టప్పాచబుత్రా, గుడిమల్కాపూర్, సీతారాంబాగ్, ఆసిఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. రాంగ్‌రూట్‌లో వెళ్తున్నవారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సందర్భంగా రాంగ్ రూట్‌లో వెళ్తున్న 16 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్, కుల్సుంపురా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు కోటేశ్వర్‌రావు, రాజేంద్రప్రసాద్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్ల జీఓను కొట్టివేసే వీలులేదు'

కాచిగూడ: తెలంగాణలో బీసీ సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై సమగ్ర కుటుంబ సర్వే, డెడికేషన్ కమిషన్ నివేదిక తర్వాతే ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ నం.9ని జారీ చేసిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తెలిపారు. దీనికి పూర్తి చట్టబద్ధత ఉండటంతో బీసీ రిజర్వేషన్ల జీఓను హైకోర్టు కొట్టివేయడానికి వీలులేదన్నారు. బుధవారం లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ప్రధానకార్యదర్శి సామల రవీందర్, మాజీ జీపీ రాంప్రసాద్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలో ఎక్కడ కూడా 50 శాతం పరిమితి లేదని కాబట్టి ప్రభుత్వానికి ఎలాంటి అడ్డంకి ఉండదని గుజ్జ కృష్ణ పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ఎన్నికలు యథావిధిగా కొనసాగనున్నాయని తెలిపారు. ఈ ఎన్నికల నిలుపుదలకు కొందరు జీఓ నం.9పై స్టే విధించాలని కోర్టును ఆశ్రయించినందున కోర్టు దానిని తోసిపుచ్చిందన్నారు.

కులాంతర వివాహ రక్షణ చట్టం చేయాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆదర్శ వివాహంలో మాట్లాడుతున్న వినయ కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కులాంతర వివాహాలను ప్రోత్సహించడానికి వారికి రక్షణ చట్టం చేయాలని ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో వెన్నెల, హరీష్‌ల ఆదర్శ వివాహం జరిగింది. ఈ సందర్భంగా పూల దండలు మార్పించి ప్రమాణ పత్రాలు చదివించి వివాహం జరిపించారు. అనంతరం వినయకుమార్ మాట్లాడుతూ... కులాంతర మతాంతర వివాహాలను ప్రోత్సహించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు, కోటారమేష్, పాలడగు భాస్కర్, శ్రీరాం నాయక్, ఎస్. రజనికాంత్, టి. నాగరాజు, ఎం. శోభన్ నాయక్, మహేందర్ తదితరుల పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

అబిడ్స్: పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రాజెక్ట్ అధికారి కృష్ణ చైతన్య పేర్కొన్నారు. గోడేకికబర్ ప్రాంతంలో సూపర్‌వైజర్ అనిత ఆధ్వర్యంలో బుధవారం జాతీయ పోషక మాస వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉండేందుకు పోషక విలువల ఆహారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కార్యక్రమంలో కృష్ణ చైతన్య, అనిత తదితరులు

'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు'



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో దామోదర్ గుప్తా

గన్‌ఫౌండ్రీ: త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దామోదర్‌గుప్తా ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికలపై చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎన్నికల్లో ప్రజలు తిప్పికొట్టడం ఖాయమన్నారు.

రెండో అంతస్తు పైనుంచి పడి యువకుడి మృతి

బంజారాహిల్స్: భవనం రెండో అంతస్తులో వెల్డింగ్ పనులు చేస్తున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తూ కిందపడి మృతి చెందిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కార్వాన్‌కు చెందిన మహ్మద్ అజ్మత్ (19) అల్లాపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న యూనిక్ ఫ్యాబ్రికేషన్స్‌లో యూనస్‌ఖాన్ వద్ద వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్–10లోని జహీరానగర్‌లో అబ్దుల్లా అనే ఇంటి యజమాని సెకెండ్ ఫ్లోర్‌లో వెల్డింగ్ పనులు చేస్తుండగా రక్షణ సౌకర్యాలు లేకపోవడంతో జారి కిందపడి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఎండీ ఇబ్రహీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కాంట్రాక్టర్ యూనస్‌ఖాన్‌తో పాటు ఇంటి యజమాని అబ్దుల్లాపై నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ వైద్యుడి అరెస్టు

బంజారాహిల్స్: రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుణ్ణి జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. వెంకటగిరిలో నివసించే నీలి శశిధర్ (32) డాక్టర్‌గా చెలామణి అవుతూ రహమత్‌నగర్‌లో వెంకటేశ్వర ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను గత కొంతకాలంగా నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్నాడు. ఎంబీబీఎస్ చదివిన డాక్టర్ లాగా ప్రిస్కిప్షన్లు రాస్తూ రోగులకు వైద్యం చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఈ క్లినిక్‌పై దాడి చేసి నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రోగులను చీటింగ్ చేస్తున్నట్లు కూడా గుర్తించారు. అంతేకాకుండా సమీపంలో శ్రీనివాస్ అనే వ్యక్తితో మెడికల్ షాపు కూడా తెరిపించాడు. శశిధర్ రాసిన మందులను శ్రీనివాస్ విక్రయించేవాడు. ఇది కూడా నిబంధనలకు విరుద్ధమేనని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో పోలీసులు నీలి శశిధర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. క్లినిక్‌లో పెద్ద ఎత్తున మందులను, వైద్య సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేని దుకాణం సీజ్



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ నెంబర్–1/3 నాగార్జున సర్కిల్‌లో ఉన్న ఎంపీఎం స్క్వేర్ మాల్‌లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న దుకాణాన్ని జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 డీసీ సమ్మయ్య ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఈ మాల్‌లో బనానా క్లబ్ పేరుతో కొనసాగుతున్న దుకాణం ట్రేడ్ లైసెన్స్ లేకుండా నిబంధనలు ఉల్లంఘించి నడిపిస్తున్నారని సమాచారం రావడంతో దీనిని సీజ్ చేసినట్లు డీసీ తెలిపారు.

మూణ్నాళ్ల ముచ్చటే..!

- లక్షలాది రూపాయలతో ఇటీవలే మచిలీకమాన్ మరమ్మతు
- 2 రోజుల క్రితం పెచ్చులూడిన పై భాగం
- ఓ వ్యక్తి కాలుకు గాయం

చార్మినార్: గుల్జార్‌హౌజ్‌కు సమీపంలోని మచిలీకమాన్ ప్రమాదకరంగా మారింది. ఇటీవలే లక్షలాది రూపాయలతో మరమ్మతులు చేపట్టినా.. నాసిరకం పనులతో అవి కాస్తా మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలాయి. మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మచిలీకమాన్ పై భాగంలోని సిమెంట్ పెచ్చులూడి అక్కడే కింద ఉన్న ఓ వ్యక్తిపై పడడంతో అతని కాలుకు గాయమైంది. పనులు పూర్తయిన 2 నెలలకే కమాన్ పై భాగంలో పెచ్చులూడడంతో పాటు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. అయినా ఎవరూ పట్టించుకునే వారే లేకపోవడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు.



పెచ్చులూడిన మచిలీకమాన్